# కావ్.... కావ్.... కావ్....

కావు కావుమంటూ వేపచెట్టుమీద కాకులు ప్రభాత గీతాలు పలికాయి. తూర్పు వేపున ఆకాశం ఎర్రనైంది. భళ్ళున తెల్లవారింది.

కాంతమ్మ కళ్ళు నలుపుకుంటూ పెరట్లోకి వచ్చింది.

నూతి దగ్గర నీళ్ళు తోడుకుంటూ కనబడింది కన్నమ్మ.

పొద్దున్నే దీని మొహం చూశాను ఏమిటవుతుందో అనుకొంటూ కొబ్బరి ఈనెల చీపురుతో పెరటి వాకిలి తుడిచి. వీధివాకిలి తుడవడానికి వెళ్ళింది కాంతమ్మ. అప్పటి కప్పుడే కోడలు లేచి అంట్లు నూతి దగ్గరికి పట్టికెళ్ళింది తోమడానికి.

నిన్నటిదాకా ఇంటినిండా చుట్టాలే. మాయదారి ముండా చుట్టాలు జలగల్లా పట్టుకుని పీడిస్తున్నారు. ఒక్క చేతి సంపాదన మీద నెట్టుకురావాలి గంపెడు సంసారం. ఎక్కడలేని సొమ్మూ వీళ్ళ ఎదానే పొయ్యవలసి వస్తుంది అనుకుంటూ కళ్ళాపి జల్లి ముగ్గు వేసింది కాంతమ్మ. అప్పటికి తెల్లగా తెల్ల వారింది.

ముత్యాలరావు లేచి వీధిరుగుమీద కూచుని పలకర్రతో పళ్ళు తోముకోనారంభించాడు.

అమ్మా– నేనివ్వాళ ఎనిమిది గంటలకే స్కూలుకి వెళ్ళిపోవాలి. పెందరాళే టిఫిన్ చెయ్యమన్నాడు చిన్నకొడుకు. వాడు బొడ్డువారి హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు రెండో కూతురికి నిన్ననే మొదటి పచ్చం. ఈ మధ్య సుస్తీ చేసింది. మనిషి ఎండుపుల్లలా అయిపోయింది.

అన్ని డబ్బాలూ ఖాళీగానే దర్శనమిచ్చాయి. ఒక్క పప్పుబద్దలేదు. విసిరిన బియ్యపు నూకా, కరాచీ నూకా నిండుకున్నాయి. కాంతమ్మకి మనసు చాలా కష్టం వేసింది. దస్తాగిన్నె అడుగున మాత్రం ఎలా మిగిలిందో కాస్త గోధుమ నూక ఉన్నది. సుబ్బరంగా పట్లు పట్టేసింది. దులిపి బాగుచేసి ఉప్మా చెయ్యడానికి కూచుంది.

ముత్యాలరావుకి కాఫీ యిచ్చింది కోడలు. కాఫీ ముగించి చుట్ట ముట్టించాడు. అతగాడు మునసబు కోర్టులో హెడ్ గుమాస్తా. మరో రెండేళ్ళలో రిటయిరయి పోతాడు. పెద్దవాడు పోస్టల్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగంలో ఈ మధ్యనే ప్రవేశించాడు. అదేదో టెలిగ్రాఫ్ ట్రయినింగ్ కోసం గావును హైదరాబాద్ వెళ్ళాడు. వాడి పెళ్ళామే ప్రస్తుతం ఇంట్లో వున్నది. పెద్ద పిల్లకి పెళ్ళయింది. అనకాపల్లి దాని అత్తవారు. ఈ మధ్యనే అల్లుడూ, కూతురూ వచ్చి వెళ్ళారు. వాళ్ళు ఉండగానే భీమవరం నుంచి మేనల్లుడొచ్చి నాలుగురోజులుండి వెళ్ళాడు.

టిఫిన్లూ, కాఫీలూ ముగిసేసరికి ఎనిమిదయింది.

టిఫిన్ తిన్న పళ్ళాలు వసారాలో పడేసింది కోడలు.

మిరపకాయ ముక్కలూ, కరివేపాకూ కోసం కావు కావుమంటూ కాకులు జట్టీలాడుకుంటున్నాయి.

కాంతమ్మకి గుండె గుభేలుమని పోయింది.

"కొట్టండిరా నాయనా ఆ దిక్కుమాలిన కాకుల్ని. నిన్నటిదాకా ఇల్లు ఖాళీ లేదు. మళ్ళీ ఏ మూల నుంచి వచ్చి పడతారో మనుషులు. నేను చేసిపెట్టలేను. నావల్ల కాదు. కొట్టండిరా నాయనా కాకుల్ని కొట్టండిరా" అన్నది రాగాలు తీస్తూ కాంతమ్మ.

కాకుల్ని కొట్టి. పళ్ళాలు కడిగి ఇంట్లో పెట్టింది కోడలు.

కూతురూ. అల్లుడూ కాక– ముత్యాలరావు అక్కగారు, బావగారూ గత నెలంతా ఇంట్లోనే వున్నారు. అక్కగారికి చీరా, బావగారికి పంచె పెట్టి పంపేసరికి ఆయిదో ప్రాణం కోయిలొకొచ్చింది ముత్యాలరావుకి.

ముత్యాలరావు చేస్తున్నది రాబడి సంపాదించగల ఉద్యోగమే అయినా, ఆ విషయంలో అతను బొత్తిగా చేతగానివాడు. కాని బహు జాగర్తఅయిన మనిషి. వీధిలో కెళితే ఏగాణీ ఖర్చుండదు. ఈ చుట్టాల తాకిడికి కాంతమ్మ మెడలో వున్న ముప్పేట గొలుసు తాకట్టు పడింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాయి.

ఎండగూబ గుయ్యిమనిపించేస్తోంది. ఫిబ్రవరి నెలాఖరుకే ఎండలు తేరిపార చూడవశం కాకుండా వున్నాయి. కోడలు కంచాలు కడుగుతోంది. వన్నార గోడమీంచి కావుకావుమంటూ ఒక కాకి అరవనారంభించింది.

కాంతమ్మ వొళ్ళు నీరు విడిచిపోయింది.

"కొట్టండిలా నాయనా ఆ దిక్కుమాలిన కాకుల్ని నిక్షేపంలాంటి ముప్పేట గొలుసు తాకట్టు పడింది. అది మళ్ళీ కళ్ళారా చూసుకునేదెప్పుడో. అమ్మడూ కొట్టవే కాకుల్ని. నళినాక్షీ కాకుల్ని కొట్టు" అంటూ మొదలు పెట్టింది.

నళినాక్షి అంటే కోడలు.

మధ్యాహ్నం బళ్ళోకి వెళ్ళబోతున్న రెండో కొడుకు–

నువ్వెప్పుడూ అలాగే అంటావు. కాకులరిస్తే చుట్టాలొస్తారేమిటి? పొద్దుట్నుంచీ అరుస్తూనే వున్నాయి. ఏరీ వచ్చారా?– అన్నాడు.

వేప చెట్టు కింద చల్లనిగాలి వీస్తోంది. మడతమంచం పడేసుకుని నడుంవాల్చింది కాంతమ్మ. భుక్తాయాసంతో కళ్ల మూతలు పడిపోయాయి.

కోడలు ముందు గదిలో కూచుని లేసు అల్లుకుంటోంది.

రెండో కూతురు గడపలో కూచుని వీక్లీలో సీరియల్ చదువుతోంది.

కావుకావుమంటూ వేపచెట్టుమీద కాకులు ఒకటే గోల ప్రారంభించాయి. తుళ్ళిపడి లేచింది కాంతమ్మ. వెధవ కాకులు తమ ప్రాణానికి వచ్చినపడ్డాయి. "షో షో" అన్నది.

మంచంమీంచి లేచి "హాత్ కాకీ" అన్నది.

ఎక్కడో వేపచెట్టు మీదున్న కాకులికి ఈవిడ బెదిరిస్తే ఖాతరేమిటి?

ఒకటి రెండు మూడు పదీ పాతిక చాలా కాకులు చేరాయి. అవతలి వీధిలో కాకి పిల్ల కాలు విరిగి నేలమీదపడి గిలగిలకొట్టుకుంటున్నది. దానికొచ్చిన కష్టానికి కాకులు కావుకావుమంటూ ఏడుస్తూ తమ సానుభూతినీ, సంతాపాన్నీ తెలుపుతున్నాయి. పుచ్చలవీధిలోంచీ, నాగాళవు వీధిలోంచీ. ఇటు కొయ్యసాయిబు మేడ వేపునుంచీ తండోపతండాలుగా కాకులొచ్చి ఆళవు వీధి చెట్ల నిండా కావుకావుమంటూ ఒకటే గోల–

ఏం ముండా కాకులు.... అందుకే కాకి గోల అంటారు అనుకున్నది కాంతమ్మ.

అత్తగారు లేవడం చూసి లేసు ఒక దగ్గర దాచి, చేటలో బియ్యం పోసుకుని ఏరనారంభించింది కోడలు. వెధవ కోటా బియ్యం తెల్లరాళ్ళూ, నల్లబెడ్డలూ, తవుడూను. రేపు రెండుపూట్లా వస్తాయి బియ్యం. ఫస్టు తారీఖు ఇంకా నాలుగు రోజులున్నది.

ఎప్పుడూ ఎవరో ఒకరు చుట్టాలు వుంటారాయెను. ఇల్లు చూస్తే విశాలమయిందికూడా కాదు. పీలికలాగ సన్నగా పొడుగ్గా వుంటుంది. గుమ్మాలన్నీ తిన్నగా వీధికెదురుగా వుంటాయి. ఈ విజీనారంలో అద్దె కొంపలే అంత. ఇప్పటి అద్దె అరవయి. వచ్చే నెల నుంచీ మరో అయిదు వెయ్యాలట!

చుట్టాలొస్తే ఒక గొడవా? వాళ్ళకి మర్యాద చెయ్యాలి. ఎవర్నీ ఏమీ అనడానికి వల్లకాదు. ఇంట్లో వాళ్ళమీద విసుక్కున్నా ఎక్కడ తప్పట్టుకుంటారోనని భయం. అగ్గగ్గలాడుతూ అన్ని పన్లు చెయ్యాలి.

నాలుగయింది. కోడలు వంటపని ప్రారంభించింది. కాంతమ్మ వీధరుగుతుడుస్తూ వుండగా ఇంటిముందు రిక్షా ఆగింది.

పెద్దవాడి అత్తగారూ, మామగారూను. వెంట చిన్న కుర్రాడు.

"రెండో పిల్లకి వైజాగ్‌లో సమ్మంధం వుందని తెలిసి చూద్దామని వచ్చాం. పన్లోపని పిల్లని కూడా ఓసారి చూద్దాం అనీ" అంది వీపరాలు రిక్షా దిగుతూనూ.

కాంతమ్మకి పై ప్రాణాలు పైనే పోయాయి.

"మంచి పని చేశారు. రండి– రండి" అంటూ లేని నవ్వు తెచ్చుకుని లోపలికి నడిచింది కాంతమ్మ. తల్లీ. తండ్రీ. తమ్ముడూ కనిపించగానే కోడలు చేటంత మొహం చేసుకోవడం కాంతమ్మ కనిపెట్టకపోలేదు.

మూణ్నెళ్ళు నిండలేదు కోడలు పుట్టింటినించి వచ్చి.

కూతురంటే అంతచేటు అపురూపమా- అనుకుంది కాంతమ్మ.

కాఫీ పొడినిండుకుంటే సిల్వరు కప్పిచ్చి రెండో పిల్లని పక్కింటికి పంపించింది పెరటితోవని. కోడలు గబగబా కాఫీలు చేసింది.

రెండోవాడు బడినించి రానేవచ్చాడు.

అమ్మా నీ మాటే నిజమయింది. చుట్టాలొచ్చారు– అన్నాడువాడు వీధి లోంచే– చుట్టాలు కాపీలు తాగుతూండటం గమనించి.

"రోజూ కాకులు అరవకా మానవు. నీ భయంకొద్దీ రోజూ ఎవరో ఒకరు చుట్టాలు రాకనూ మానరు" అన్నడు వాడు కాళ్ళు కడుక్కుంటూ.

వెధవా- వెధవ ముదర మాటలూ నువ్వూను– అన్నాది కాంతమ్మ.

వాడా ముక్క అన్నందుకు ఆవిడకి లోపల సంతోషంగానే వున్నది.

వియ్యంకుడూ వీపరాలూ గతుక్కునున్నారు.

కోడలు మొహం చిన్నబుచ్చుకుంది.

పెరట్లో వేపచెట్టు మీద కాకులు కావు కావు కావుమంటూ ఇంకా అరుస్తూనే వున్నాయి.

"కొట్టండర్రా దిక్కుమాలి కాకుల్ని" అన్నది కాంతమ్మ.

రచనాకాలం : 1-12-75

ప్రచురణ : ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక, 23-9-77